క్లుప్తంగా

పీహెచ్‌సీని తనిఖీ చేసిన జిల్లా మలేరియా అధికారి



పెదకూరపాడు: పల్నాడు జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ సోమవారం 75 త్యాళ్లూరు పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని రికార్డులు పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమాన్ని పాటించాలని తెలిపారు. దోమల బెడదను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. తప్పనిసరిగా దోమ తెరలు వాడేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి బేగ్, పీహెచ్‌సీ, ఎంపీహెచ్‌సీ ఈఓ విజయకుమార్, హెల్త్ సూపర్‌వైజర్ దిలీప్‌కుమార్, సుభాషిణీ, దుర్గాకుమారి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

తొండపిలో ఫ్యామిలీ ఫిజీషియన్



తొండపి(ముప్పాళ్ళ): మండలంలోని తొండపి గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం సోమవారం జరిగింది. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు జయకృష్ణ, వి.సూర్యప్రకాశరావులు పాల్గొని 91 మందికి వైద్య సేవలందించారు. అవసరమైన వారికి రక్తపరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులను అందించారు. గర్భిణులకు, బాలింతలకు వైద్య సేవలందించి వ్యాక్సిన్ అందించారు. అనారోగ్యానికి గురై మంచంలో ఉన్న రోగుల వద్దకు వెళ్లి సలహాలు, వైద్య సేవలందించారు. ఎంఎల్‌హెచ్‌పీ సుగుణ, ఏఎన్ఎం అన్నామణి, ఎమ్‌పీహెచ్ఎస్ ఏ.పీటర్‌దేమియన్, జోస్పిన్ రాణి, డీఈఓ రవితేజ, రవిచంద్ర, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంధన పొదుపు చేసిన డ్రైవర్లకు సత్కారం



సత్తెనపల్లి: ఇంధన పొదుపు చేసిన ఆర్టీసీ డ్రైవర్లను ఆదర్శంగా తీసుకోవాలని ఆర్టీసీ సత్తెనపల్లి డిపో మేనేజర్ జీఎస్‌వీవీ కుమార్ చెప్పారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలో డిసెంబర్ నెల అత్యధిక ఇంధన పొదుపు చేసిన డ్రైవర్లను సోమవారం సత్కరించి నగదు రివార్డులను అందించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ జీఎస్‌వీవీ కుమార్ మాట్లాడుతూ ప్రతి డ్రైవర్ ఇంధన పొదుపు చేయాలనే లక్ష్యాన్ని పెట్టుకుని ఆ లక్ష్యసాధనకు కృషి చేయాలన్నారు. డిసెంబర్ నెలలో అత్యధికంగా 6 కేఎంపీఎల్ తీసుకొచ్చిన కెకె.రావు, 5.89 కెఎంపీఎల్ తీసుకొచ్చిన డ్రైవర్ సురేష్ లను అభినందించి నగదు రివార్డులను అందించారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు, తదితరులు ఉన్నారు.

కూచిపూడి నాట్య విద్యార్థినుల ప్రతిభ



సత్తెనపల్లి: పట్టణంలోని శ్రీ తారక్ ఛత్రపతి నాట్య కళానిలయం కూచిపూడి నాట్య విద్యార్థులు హైదరాబాద్ లోని తెలంగాణ సారస్వత పరిషత్ నందు నిర్వహించిన విజయ మాధవి సంస్కృతిక సేవాసమితి వారి వండర్ బుక్ ఆఫ్ రికార్డులో పాల్గొని ప్రతిభ చూపారు. ప్రతిభ చూపిన విద్యార్థినులను పావని, . దరణి, నిఖిత, లితికా, దివ్య శ్రీ, చరిష్మా, తులసి, యువహర్షి నీ, దీప్తి శ్రేయ, విస్మ్వగ్న లను, గురువు తేనేటి కరుణాకర్‌లను అభినందించారు.

సత్తెనపల్లి ఎస్ఈబీ ఇన్‌చార్జి సీఐగా తులసి

సత్తెనపల్లి: స్పెషల్ ఫోర్స్ మెంట్ బ్యూరో సత్తెనపల్లి ఇన్‌చార్జి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా టీ.తులసి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ సీఐగా పని చేసిన డీ.శ్రీధర్ బాబు తెలంగాణ సర్వీస్‌కు వెళ్లారు. తెలంగాణలోని రెవెన్యూ విభాగంలో శిక్షణ పొంది అనంతరం డిప్యూటీ తహసీల్దార్ గా ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. 2021 జూన్ 16న ఆయన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సత్తెనపల్లి సీఐగా బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న టీ.తులసికి ఇన్‌చార్జి సీఐ బాధ్యతలను అప్పగించారు.

మహిళలను ప్రోత్సహించేందుకే ముగ్గుల పోటీలు

- మంత్రి అంబటి రాంబాబు
- పట్టణ స్థాయి విజేతలకు బహుమతుల ప్రదానం



ప్రథమ స్థానం సాధించి రూ.25 వేలు చెక్కు మంత్రి అంబటి రాంబాబు చేతులమీదుగా అందుకున్న ఉమాదేవి



మండల స్థాయిలో ముగ్గులు వేస్తున్న మహిళలు



సత్తెనపల్లి పట్టణ స్థాయిలో ప్రథమస్థానం కైవసం చేసుకున్న ముగ్గు



మండల స్థాయి ముగ్గుల పోటీలలో గెలుపొందిన విజేతలు

సత్తెనపల్లి : మహిళలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో రాజకీయాలకు అతీతంగా, సాంప్రదాయాలను భవిష్యత్తుతరాలకు తెలియ చేసేందుకే నియోజవర్గ స్థాయి వైఎస్సార్ గ్రామీణ ముగ్గుల పోటీలను వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఏటా నిర్వహిస్తున్నామని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని సుగాలీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో పట్టణ స్థాయి ముగ్గుల పోటీలు సోమవారం కోలాహలంగా జరిగాయి. మొత్తం 31 వార్డుల నుంచి వార్డు స్థాయి ముగ్గుల పోటీల్లోని 75 మంది విజేతలకు గాను 68 మంది పట్టణ స్థాయి ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. పోటీల్లో ప్రథమస్థానం బి.ఉమాదేవి, ద్వితీయస్థానం నాగజ్యోతి, తృతీయ స్థానం రాయుడు గీతీదేవి, చతుర్థస్థానం కె.వనజకుమారి, ఐదవస్థానం టీ.ప్రసన్నలక్ష్మీ కైవసం చేసుకున్నారు. అనంతరం విజేతలకు బహుమతుల పంపిణీ చేశారు. ఈ పంపిణీలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. వారిలో నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఈ పోటీలు ఉపయోగ పడుతున్నాయన్నారు. ఈ ఏడాది నియోజకవర్గ వ్యాప్తంగా జరుగుతున్న పోటీల్లో పదివేల మందికి పైగా మహిళలు పాల్గొనే అవకాశం ఉందని వివరించారు. పాల్గొన్న ప్రతి ఒక్క మహిళకు పార్టీ నుంచి బహుమతి అందిస్తున్నామన్నారు. ప్రతి ఏడాది నియోజకవర్గస్థాయి విజేతల్లో ఇద్దరిని లక్షాధికారులను చేస్తున్నామని వివరించారు. అనంతరం పట్టణ స్థాయి పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన బి.ఉమాదేవికి రూ. 25 వేలు, ద్వితీయ బహుమతి సాధించిన నాగజ్యోతికి రూ. 15 వేలు, తృతీయ బహుమతి సాధించిన రాయుడు గీతాదేవికి రూ.10 వేలు, చతుర్థ బహుమతి సాధించిన వనజ కుమారికి రూ.5 వేలు నగదు చెక్కులను, ఐదవస్థానం సాధించిన టీ.ప్రసన్న లక్ష్మీకి ప్రత్యేక బహుమతి అందించారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివ రావు, మున్సిపల్ వైస్ చైర్మన్లు షేక్ నాగూర్ మీరాన్, రమావత్ కోటేశ్వరరావు నాయక్, ఉమెన్స్ డెవలప్ మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ గీతా హసంతి, కౌన్సిలర్ అచ్యుత శివ ప్రసాద్, వరికల్లు కోటేశ్వరరావు, కోఆప్షన్ మెంబర్ కొణతం స్వాతి, నాయకులు డాక్టర్ మక్కెన అచ్చయ్య, ఆకుల హనుమంతురావు, కోడిరెక్క దేవదాస్, ఉల్లంఘుల ప్రసాద్‌బాబు, షేక్ గని, బండి మల్లిఖార్జునరెడ్డి, సయ్యద్ ఖాజా, శిరిగిరి వెంకట్రావు, వెలుగూరి శరత్, పెండెం బాబు రావు, జూపల్లిపాల్, కాటుమాల డేవిడ్, సహారా మౌలాలి, రేపూడి రవితేజా, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.

ముగ్గుల పోటీ విజేతలకు బహుమతుల అందజేత

రాజుపాలెం: మహిళలను ఆటల్లో ప్రోత్సహించేందుకే ప్రతి ఏటా రాష్ట్ర జలవనరుల శాఖా మాత్యులు అంబటి రాంబాబు ఆధ్వర్యంలో వైఎస్సార్ గ్రామీణ సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు మహిళ సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ గీతాహాసంతి అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో మండల స్థాయి ముగ్గుల పోటీలను సోమవారం నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి మహిళలు తరలి వచ్చారు. ముందుగా మంత్రి రాంబాబు మండల స్థాయి ముగ్గుల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ గీతా హాసంతి మాట్లాడుతూ కనుమరుగవుతున్న ముగ్గులను వెలికి తీసేందుకే పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీన నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే ముగ్గుల పోటీల్లో మండల స్థాయిలో గెలుపొందిన మహిళందరు హాజరు కావాలని సూచించారు. అనంతరం గ్రామస్థాయి, మండల స్థాయి విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. ముగ్గుల పోటీలలో పాల్గొన్న ప్రతీ మహిళకు ప్రోత్సాహక బహుమతులు ఇస్తున్నట్లు డాక్టర్ గీతాహాసంతి తెలిపారు.

నేడు మండల స్థాయి ముగ్గుల పోటీలు

సత్తెనపల్లి: మహిళలను ప్రోత్సహించేందుకు వైఎస్ఆర్ సీపీ ఆధ్వర్యంలో ఏటా నిర్వహిస్తున్న వైఎస్సార్ సంక్రాంతి గ్రామీణ ముగ్గుల పోటీల్లో భాగంగా సత్తెనపల్లి రూరల్ స్థాయిలో ముగ్గుల పోటీలను మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో గల సుగాలీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరుగుతాయని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాయపాటి పురుషోత్తమ రావు సోమవారం తెలిపారు. ఇటీవల గ్రామ పంచాయతీ స్థాయిలో గెలుపొందిన మహిళలు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. పోటీలను తిలకించేందుకు రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు హాజరౌతారన్నారు. పోటీల్లో పాల్గొనే మహిళలతో పాటు మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరై పోటీలను విజయవంతం చేయాలని కోరారు.

ముప్పాళ్ళ: మండల స్థాయి వైఎస్సార్ గ్రామీణ ముగ్గుల పోటీలు ఈ నెల 10వ తేదీన జరగనున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకులు ఎమ్‌జెఎమ్‌రామలింగారెడ్డి సోమవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు చాగంటివారిపాలెం శ్రీసాయిబాబాఆలయ ఆవరణలో జరిగే పోటీల్లో గ్రామస్థాయిలో విజేతలైన వారంతా పాల్గొనాలన్నారు. మండల స్థాయిలో విజేతలకు రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు చేతుల మీదుగా బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం జరుగుతుందన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



విద్యార్థులతో మొక్కలు నాటిస్తున్న ఉపాధ్యాయుడు

అచ్చంపేట: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఉపాధ్యాయుడు తుమ్మా శౌర్రెడ్డి సూచించారు. మండలంలోని తాళ్ల చెరువు ఆర్‌సీఎం పాఠశాల ఆవరణలో సోమవారం విద్యార్థులతో ఆయన మొక్కలు నాటించారు. ఇల్లు, పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకొని, మొక్కలు నాటడం ద్వారా ఆరోగ్యకరంగా జీవించవచ్చని విద్యార్థులకు సూచించారు.

వడ్డె ఓబన్న జయంతిని విజయవంతం చేయాలి

సత్తెనపల్లి: వడ్డె ఓబన్న జయంతి వేడుకలు ఈ నెల 11న సత్తెనపల్లి పట్టణంలోని ఐదులాంతర్ల సెంటర్‌లో గల మాడా విశ్వేశ్వరావు కల్యాణ మండపంలో జరుగుతాయని, వేడుకలను విజయవంతం చేయాలని నియోజకవర్గ వడ్డెర సేవా సంక్షేమ సంఘం ముఖ్య నాయకుడు బూర్సు శ్రీనివాసరావు కోరారు. సోమవారం నిర్వహించిన వడ్డెర కుల పెద్దల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గ వడ్డెర సేవా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వడ్డెర సంఘ క్యాలెండర్ - 2023 ఆవిష్కరణ కూడా జరుగుతుందన్నారు. అలాగే పల్నాడు జిల్లా వడ్డెర వెల్ఫేర్ బోర్డ్ సభ్యులుగా నూతనంగా ప్రభుత్వం నియమించిన సభ్యులకు సన్మాన కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు, గుంటూరు మిర్చియార్డు చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం, వడ్డెర కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ దేవళ్ళ రేవతి హాజరౌతారన్నారు. వడ్డెర సంఘ నాయకులందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

చేసిన మేలును గడప గడపకు వివరిస్తున్నాం



మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే శంకరరావు తదితరులు



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే నంబూరు తదితరులు

అమరావతి: మూడున్నరేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో ఇచ్చిన హామీలే కాకుండా అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసి, సీఎం వైఎస్ జగన్ మోహనరెడ్డి పేదలకు చేసిన మేలును గడప గడపకు వివరిస్తున్నామని పెదకూరపాడు శాసన సభ్యుడు నంబూరు శంకరరావు పేర్కొన్నారు. సోమవారం అమరావతిలో 4వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. రాజీవ్‌కాలనీ, జగజ్జీవన్‌రాం కాలనీ, విజయసాగర్‌కాలనీలో సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సైడు కాలువలు కట్టి, కొన్ని చోట్ల రోడ్లు వేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే తన వెంట ఉన్న అధికారులను అంచనాలు తయారుచేయాలని ఆదేశించారు. రేషన్‌కార్డులు, ఇళ్ల స్థలాలను కొందరు కోరారు. అర్హులైన వారందరికి రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకరరావు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన సుదీర్ఘ పాదయాత్రలో ప్రత్యక్షంగా ప్రజల కష్టాలను చూసి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. అమరావతిలో మూడున్నరేళ్లలో రూ.15కోట్ల సంక్షేమ పథకాలు, రూ.2కోట్ల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ కోట హరిబాబు, జడ్పీటీసీ ఈద్పుగంటి కరుణకుమారి, జడ్పీ కో-ఆప్షన్ మెంబర్ షేక్ హష్మీ, పార్టీ మండలాధ్యక్షుడు మంగిశెట్టి శ్రీనివాసరావు, సర్పంచ్ పాలపర్తి రాజేశ్వరి, ఉప సర్పంచ్ నిమ్మా విజయసాగర్ బాబు, ఎంపీటీసీ గుడిశె అనూషా, పార్టీ నాయకులు మంగిశెట్టి కోటేశ్వరరావు, అలాలక్ష్మీనారాయణ, నందూరి కరుణకుమార్, విన్నకోట సాంబశివరావు, గొట్టెం చిన్నప్ప, శివరామకృష్ణ, పి.రోశిబాబు, నంబూరు బాబురావు, అళ్ల శ్రీనివాసరెడ్డి, భవిరిశెట్టి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

సుదీర్ఘ పాదయాత్ర.. సుపరిపాలనకు నాంది

అమరావతి: సీఎం జగన్‌మోహనరెడ్డి చేసిన నాటి సుదీర్ఘ ప్రజా సంకల్పయాత్రతోనే నేటి సుపరిపాలనకు నాంది అని పెదకూరపాడు శాసనసభ్యుడు నంబూరు శంకరరావు అన్నారు. సోమవారం స్థానిక జగజ్జీవన్‌రామ్ కాలనీలో ప్రజా సంకల్ప యాత్ర పూర్తిచేసి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేసి, కేక్ కట్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే శంకరరావు మాట్లాడుతూ.. పాదయాత్ర ప్రతి అడుగులో ప్రజల కష్టాలను తెలుసుకుని అధికారంలోకి వచ్చాక వాటిని తీర్చడానికి అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇచ్చిన హామీలలో 95శాతం నెరవేర్చిన ఘనత సీఎం జగన్ మోహనరెడ్డికి దక్కుతుందన్నారు. ప్రజల అండదండలతో ఈసారి 175సీట్లు గెలవడం ఖాయమన్నారు.

ప్రజల కోసమే.. ప్రజా సంకల్పయాత్ర



కేక్ కట్‌చేస్తున్న ఎంపీపీ కోటయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు

క్రోసూరు: ప్రజా సమస్యల పరిష్కారం కోసం.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప యాత్ర చేట్టారని ఎంపీపీ పి.కోటయ్య పేర్కొన్నారు. ప్రజా సంకల్పయాత్ర నిర్వహించి నాలగేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా సోమవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మండల నాయకులు కేక్ కట్ చేసి, సంబరాలు చేసుకొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ పి.కోటయ్య, జడ్పీటీసీ షేక్ జమీలా మాట్లాడారు. అప్పటి ప్రతిపక్ష నేతగా.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రతో రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారన్నారు. ప్రజా సంకల్పయాత్రలో తెలుసుకున్న సమస్యలను పరిష్కరించేందుకు నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన ఏకైక ప్రజా నాయకుడిగా దేశ చరిత్రలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచిపోయారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యే నంబూరు శంకరరావును ప్రజలు ఎప్పటికీ మరిచిపోరని తెలిపారు. జై జగన్, జై నంబూరు శంకరరావు అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెలది అప్పారావు, నారు శ్రీనివాసరెడ్డి, గార్లపాటిదాసు, మేదర రోశయ్య, ఎంపీటీసీ వేణుగోపాలరెడ్డి, షేక్ గపూర్, షేక్ ఖాదర్, గంజినబోయిన శ్రీనివాసరావు, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు



వడ్డవల్లిలో ప్రత్యేక అలంకరణలో శ్రీవారు



ప్రత్యేక అలంకరణలో శ్రీవారు

సత్తెనపల్లి: ధనుర్మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్‌లో గల వెంకటేశ్వర స్వామి దేవాలయం, వడ్డవల్లి శ్రీ రామాలయం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో భక్తులు భక్తిశ్రద్ధలతో సోమవారం పూజలు నిర్వహిస్తున్నారు. వడ్డవల్లిలోని శ్రీవారికి అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందజేత



పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న డాక్టర్ ప్రదీప్, డాక్టర్ శ్రీలక్ష్మీకవిత, భానుప్రకాష్



పౌష్టికాహారం అందజేస్తున్న భానుప్రకాష్

పెదకూరపాడు: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం, 75 త్యాళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్నారై మాగులూరి భానుప్రకాష్ గర్భిణులకు పౌష్టికాహారం సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గర్భిణులు బలవర్ధక ఆహారం తీసుకోవాలని సూచించారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండేళ్ల నుంచి ప్రతి నెలా వైద్యశాలల్లో పరీక్షలకు వచ్చే గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు అర్తిమళ్ల రమేష్, బి.గోపాలరావు, వి.అప్పారావు, పీహెచ్‌సీ వైద్య అధికారి కృష్ణారావు, కె.కిరణ్‌కుమార్, షేక్ ముంతాజ్, హాజీముల్లా తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

సత్తెనపల్లి: ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సత్తెనపల్లి మండలం ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షల నిమిత్తం హాజరవుతున్న గర్భిణులకు మాగులూరి ఫౌండేషన్ ధర్మకర్త మాగులూరి భాను ప్రకాష్ సహకారంతో సోమవారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. పెదకూరపాడు మండలం హుస్సేన్ నగరం గ్రామానికి చెందిన భాను ప్రకాష్ యూఎస్ఏలో స్థిరపడ్డాడు. సేవా దృక్పథంతో సేవలందించాలనే ఉద్దేశంతో గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందించారు. అనంతరం భాను ప్రకాష్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ఫణిదం పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ వి. ప్రదీప్, డాక్టర్ యు.శ్రీలక్ష్మీకవిత, పంచుమర్తి సత్యం, పంచుమర్తి రామచంద్ర రావు, మక్కపాటి. రామచంద్రరావు, కురిచినపల్లి కిరణ్, కురిచినపల్లి మల్లేశ్వరి ఉన్నారు.

రవికుమార్‌కు ‘తెలుగు తేజం’జాతీయ విశిష్ట సేవా పురస్కారం



పురస్కారం అందుకుంటున్న రవికుమార్

సత్తెనపల్లి: పట్టణానికి చెందిన కళాకారుడు బెజగం రవికుమార్‌కు ‘తెలుగు తేజం’జాతీయ విశిష్ట సేవా పురస్కారం అందుకున్నారు. పుడమి సాహితి వేదిక 4వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సాహితీ వేదిక అధ్యక్షుడు శ్రీ చిలుముల బాల్ రెడ్డి సారధ్యములో ‘తెలుగు తేజం’ జాతీయ విశిష్ట సేవా పురస్కారాలను ఇటీవల ప్రధానం చేశారు. ఈ పురస్కారాలను రెండు రాష్ట్రాల స్థాయిలో వివిధ రంగాల్లో నిష్ణాతులైన కళాకారులు, ఉపాధ్యాయులు, సమాజ సేవకులు, రైతులను దాదాపు 90 మందిని ఎంపిక చేసి ప్రధానం చేశారు. వారిలో రవికుమార్ కూడా ఉన్నారు. రవికుమార్ తోపాటు ఈ పురస్కారాన్ని రిటైర్డ్ ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ సరికొండ రమాదేవి, ఉపాధ్యాయుడు తెలగతోటి కోటేశ్వర రావులు కూడా అందుకున్నారు. ఈ ముగ్గురిని పట్టణంలో వివిధ కళా పరిషత్తుల అధ్యక్ష, ఉపాధ్యక్ష కార్యదర్శులు, కళాకారులు, మిత్రులు, బంధువులు, శ్రేయోభిలాషులు మంగళవారం అభినందించారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

- డీపీఈ, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ విజయ్ కృష్ణ
- సత్తెనపల్లిలో 39 బృందాలు 3,171 సర్వీసులు ఆకస్మికంగా తనిఖీ



వివరాలు వెల్లడిస్తున్న డీపీఈ, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజయ్ కృష్ణ, అధికారులు

సత్తెనపల్లి: విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీపీఈ, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.విజయ్ కృష్ణ అన్నారు. విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం, ఆపరేషన్ విభాగం ఆధ్వర్యంలో పట్టణంలో సోమవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. 39 మంది అధికారులు, 74 మంది సిబ్బంది 39 బృందాలుగా ఏర్పడి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పట్టణంలో 3,171 సర్వీసులు తనిఖీ చేసి విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 96 మందికి రూ.4.62 లక్షలు అపరాధ రుసుమ విధించారు. మీటర్ ఉన్నప్పటికీ అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ఒకరికి రూ.0.22 లక్షలు, అనుమతించిన కేటగిరి కాక ఇతర కేటగిరీలో విద్యుత్ వినియోగించుకుంటున్న ఇరువురికి రూ.0.08 లక్షలు అపరాధ రుసుము విధించారు. అనుమతించిన లోడు కంటే అదనంగా విద్యుత్ వాడుతున్న 93 మందికి రూ.4.32 లక్షలు అపరాధ రుసుం విధించారు. అనంతరం ఆయన మాట్లాడారు. భారత విద్యుత్ చట్టం సెక్షన్ 135 ప్రకారం పని చేయని మీటర్ నుంచి విద్యుత్తు వాడుకున్నా, ఉండవలసిన మీటర్‌కు బదులు వేరే మీటర్లు పెట్టి సీలు లేకపోయినా విద్యుత్ చౌర్యం నిర్ధారణ అయినట్లు భావించబడుతుందన్నారు. మొదటిసారి తప్పిదానికి కాంపౌండింగ్ పద్ధతిలో అపరాధ రుసుము చెల్లించినచో కేసు నుండి విడిచిపెడతామన్నారు. రెండోసారి తప్పిదానికి అరెస్టు చేసి రిమాండ్ పంపి కఠినంగా వ్యవహరిస్తారన్నారు. అపరాధ రుసుము కట్టలేని పరిస్థితుల్లో రెవెన్యూ రికవరీ చట్టం ఉపయోగించి ఆస్తులు జప్తు చేయడం జరుగుతుందన్నారు. మొదటిసారి తప్పిదానికి మూడు రెట్లు, రెండవసారి తప్పిదానికి 6 రెట్లు అపరాధ రుసుం విధించే అవకాశం విద్యుత్ చట్టంలో ఉందన్నారు. విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని, విద్యుత్ చౌర్యం పై ఫిర్యాదులను పూర్తి వివరాలతో : 9440812263, 9440812360, 9440812361 నంబర్లకు లేదా వాట్సాప్ ద్వారా సంప్రదించవచ్చన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయన్నారు. దాడుల్లో ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.శ్రీనివాసరావు, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ పీ.రకుణాకర్‌రావు, డీఈఈ ఎం రవికుమార్, కె.రవికుమార్, డీఈఈ టీ.శ్రీనివాస్, ఏఈ కె.కోటేశ్వరరావు, ఆపరేషన్ ఏఈ పీ.కిరణ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.